కథ

# టీ కప్పులో తుఫాను

- ఎ. సువర్ణ

**'ఛెళ్' మంటూ పడ్డ చెంప దెబ్బకి లారెల్ కళ్ళు బైర్లుకమ్మి కింద పడబోయాడు. తనను తాను సంబాళించుకుని కిందికి జారిపోతున్న మాసికలేసిన నిక్కర్‌ని పైకి లాక్కుంటుండగానే మరో చెంప 'ఛెళ్'మంది. అంతటితో ఆగలేదు వాడికి పడే దెబ్బలు.**

అందిన చోటల్లా వాడి ఒంటిమీద దెబ్బ మీద దెబ్బలు కొడుతూనే వున్నాడు బాలయ్య.

" పగలగొడతావురా! పగలగొడతావా?" అంటూ అని అంటూనే చావబాత్తున్నాడు. "అయ్యా! కొట్టొద్దు. కొట్టొద్దు .కొట్టబాకండి దొరా! మీకు దణ్ణం పెడతా. పొరపాటైపోయింది. ఇంకెప్పుడూ పగలగొట్టను. భద్రంగా వుంటాను సామీ.." అని లారెల్ బాలయ్య రెండు కాళ్ళూ పట్టుకుని ఏడుస్తూ బతిమిలాడుతున్నాడు. అయినా బాలయ్య కసాయి హృదయం కరగలేదు. ఆగకుండా చావగొడుతూనే వున్నాడు. వాడు దెబ్బల బాధ తాళలేక పెట్టే కేకలకి, ఏడుపులు, పెడబొబ్బలకి ఫుట్‌పాత్ మీద కూరగాయలు అమ్ముకునే సూరమ్మ బేరాన్ని వదిలేసుకుని పరుగెత్తుకుంటూ బాలయ్య టీ దుకాణం దగ్గరికి వచ్చింది. లారెల్‌ని బాలయ్య దెబ్బల నుంచి విడిపించి "ఏమిటిది బాలయ్యా? పసివాడిని పట్టుకుని గొడ్డును బాదినట్టు బాదుతున్నావ్" అని అడిగింది.

"పసివాడా వాడు? పదేళ్ళు ముడ్డి కిందికొస్తేను.. వాడు చేసిన వెధవ పనేమిటో వాడినే చెప్పమను.." అన్నాడు మాలయ్య.

"ఏం చేశావురా వాగన్నా" అని సూరమ్మ అడిగిన ప్రశ్నకి జవాబు చెప్పకుండా లారెల్ వెక్కుతున్నాడు.

"వాడెందుకు చెప్తాడు చేసిన వెధవ పని? పొద్దున్నే టీ కప్పులు పగలగొట్టి నాకు మంచి బోణీ చేశాడు" అని బాలయ్య లారెల్ చేసిన తప్పు చెప్పాడు.

"చెయ్యి జారి వుంటుంది బాలయ్యా! ఆ మాత్రం దానికి పసి ఎదవని పట్టుకుని ఇట్లా బాత్తావా? ఏ తల్లో కన్న బిడ్డని.."

"పవంటే బొత్తిగా శ్రద్ధ లేకుండా పోయింది సూరమ్మత్తా వాడికి. దిక్కులు చూస్తూ నడుస్తుంటే చెయ్యి జారకేమవుతుదంట? ఒకటా, రెండా? పది కప్పులు. బంగారం లాంటి కప్పులు పగలగొట్టేశాడు వెధవ. వాడినిట్లా కొడితేనే ఒళ్ళు దగ్గర పెట్టుకుని పని చేస్తాడు" అని బాలయ్య మళ్ళీ వాడిని కొట్టడానికి చేయి ఎత్తాడు. సూరమ్మ ఆ పసివాడిని తన వెనక్కి లాక్కుంది.

మోండా మార్కెట్‌కి ఎదురుగుండా బాలయ్య టీ కొట్టు పెట్టుకున్నాడు. ఎప్పుడూ కష్టమర్స్‌తో నిండి వుంటుంది ఆ టి కొట్టు. చుట్టుపక్కలున్న చిల్లర కూరగాలమ్మే వ్యాపారులు, తట్టల వాళ్ళకీ, ఇంకా చిన్నా పెద్దా కొట్ల వాళ్ళకీ బాలయ్యే టీ సప్లై చేస్తాడు.

స్పెషల్ టీ, మీటియా టీ, మసాలా టీ, యాలక్కి టీలు బాలయ్య బాగా చేస్తాడనే పేరు రావటంతో అంతా టీ తాగడానికి ఆ కొట్టుకే వస్తారు. ఎప్పుడూ అంత రద్దీగా వుంటుంది అందుకే.

అక్కడికి వచ్చే కష్టమర్లకి టీ సప్లై చేయడానికి, బయట నుంచి వచ్చే ఆర్డర్లకి బయటికి టీలు తీసుకెళ్ళి ఇచ్చి రావడానికి బాలయ్య లారెన్‌ని పనిలో పెట్టుకున్నాడు. టీలు ఇచ్చి రావడమే కాకుండా టీ కప్పులు కడుగుతాడు వాడు. అందుకు బాలయ్య లారెల్‌కి నాలుగు వందల రూపాయిలు జీతంగా వాళ్ళ నాన్నకి నెల నెలా మనియార్డరు చేస్తాడు. భోజనం పెట్టి వుండడానికి హోటల్లోనే చోటిచ్చాడు. పండుగలు, పబ్బాలకి కొత్త లాగూ, చొక్కా కొనిస్తాడు.

ఆ పనులకి వేరే కాస్త పెద్దవాళ్ళనెవరినైనా పెట్టుకుంటే ఇంకా ఎక్కువ జీతం ఇవ్వాలి . పైగా రూల్స్ అవీ అంటూ రోజుకి ఎనిమిది గంటలు మాత్రమే పని చేస్తామంటారు. కానీ పదేళ్ళయినా



నిండని లారెల్ తెల్లారికట్టి అయిదు గంటల నుంచే పని చేయడం మొదలు పెడతాడు. రాత్రి పది గంటల వరకూ విశ్రాంతి అనేది లేకుండా పని చేస్తాడు. ఎప్పుడైనా ఏదో ఇట్లాంటి పొరపాట్లు చేసి యజమాని చేతిలో దెబ్బలు తింటాడు వాడు. అంతకంటే మరే సమస్యా లేదు లారెల్ వల్ల బాలయ్యకి.

పమిట చెంగుతో లారెల్ మొహం తుడుస్తున్న సూరమ్మకి వాడి మీద జాలి వేసింది. బాలయ్య చేతిలో చావు దెబ్బలు తిన్నాడని బాధగా వుందామెకి. 'పాపం పసివాడు. అన్యాయంగా ఈ బాలయ్య చేతి దెబ్బలు తింటున్నాడే?' అని అనుకునే సరికి ఆమె కళ్ళు చెమ్మగిల్లినయ్యి. వాడిని సూరమ్మ ప్రేమగా 'లారూ' అని పిలుస్తుంది.

జీతం ఇస్తున్నాడన్న పొగరుతోనేగా పసివాడనే కనికరం లేకుండా పాలుగారే బుగ్గలు కంది పోయేటట్టు వాయగొట్టాడు. వాడి ఈడు పిల్లలందరూ చక్కగా ముస్తాబై ఈ వేళకి స్కూల్లోకి వెడుతున్నారు. సాయంత్రం అయితే పార్కుల్లో, స్కూళ్ళల్లో ఆడుకుంటుంటే వీడు టీ కప్పులు పగలగొట్టి యజమాని చేతుల్లో దెబ్బలు తింటున్నాడు' అనుకుంది సూరమ్మ బాధగా.

మోండా మార్కెట్ చుట్టు పక్కలున్న అన్ని అంగళ్ళలోకి బాలయ్యే టీలు సప్లై చేస్తాడు. లారెల్ టీ కెటిల్‌లో పోసుకుని కప్పులు ట్రేలో పెట్టుకుని వెళ్ళి అన్ని దుకాణాలవారికి టీ ఇస్తాడు. టీ మాత్రమే ఇచ్చి రాడు. ఏవేవో కోతి చేష్టలు చేసి, పరాచికాలాడుతూ నవ్విస్తాడు.

ఓ క్యాసెట్ అంగడికి టీ పట్టుకెళ్ళినప్పుడల్లా ఆ అంగడి యజమాని మాధవరావు, "ఏరా లారెల్! నువ్వొక్కడివే వస్తున్నావు? నీ ఫ్రెండ్ హార్డీ ఏడిరా? వాడిని కూడా తోడు తీసుకొస్తావు కదరా..ఏడిరా వాడు?" అని అడిగితే-

"నేనేం చేయను సార్! వాడు ఎక్కడో యుద్ధం చేసే వాళ్ళకి అన్నం సప్లై చేయడానికి వెళ్ళిపోతనే నన్ను వదిలిపెట్టి.." అని నవ్వుతూ సమాధానమిస్తాడు అప్పుడప్పుడు యజమాని ఇంట్లో టీవీలో చూసిన 'లారెల్ అండ్ హార్డీ' సినిమాలోని ఘట్టం గుర్తుకు తెచ్చుకుని.

ఆ రోజు పొద్దున్నే స్నేహితులొస్తే ఎప్పటి మాదిరిగా కాకుండా మాధవరావు పది టీలకి ఆర్డరిచ్చాడు.

టీలు తెచ్చిన లారెల్‌ని స్నేహితులకి చూపిస్తూ-

"వీడెవరో తెలుసువా? హార్డీ లేని లారెల్..హార్డీ యుద్ధ వీరులకి అన్నం పెట్టడానికి వెడితే లారెల్ మనకందరికీ టీలు ఇస్తూ మనల్ని నవ్వించడానికి వచ్చాడు" అని మాధవరావు అన్న మాటలకి నవ్వగా, అచ్చం సినిమా లారెల్‌లా వున్న ఈ లారెల్‌ని చూసి అందరూ గొల్లున నవ్వారు.

అది చూసి వాడికి సిగ్గుగా వున్నా, మరో వంక వారందరికీ తనని పరిచయం చేస్తున్నందుకు గర్వంగానూ వుంది.

వాళ్ళందరూ టీలు తాగాక ఖాళీ కప్పులు తీసుకుని వస్తుండగా లారెల్‌కి తను చూసిన 'లారెల్ అండ్ హార్డీ' సినిమాలోని ఓ నవ్వు పుట్టించే సీను గుర్తొచ్చింది. ఇంతలో రోడ్డుమీద పారేసిన ప్లాస్టిక్ కవర్లు, ఇంకా ఏవో చెత్త సామాన్లు ఏరి గోనె సంచిలో వేసుకుంటుంది ఓ చింపిరి తలది. దాన్ని చూసి నాలుగు కుక్కలు మొరుగుతూ ఎదురుగుండా తరుముకు వస్తున్నాయి. ఆ చింపిరి తలది వచ్చి వీడిని ఢీకొన్నది. కుక్కలు వాళ్ళపైకి దాదాపు దూకుతున్నంత రౌద్రంగా అరిచేసరికి వాడు కింద పడిపోయాడు. కప్పులన్నీ రోడ్డు మీద పడి పగిలిపోయాయి. అది చూసిన బాలయ్యకి లారెల్ మీద పట్టరానంత కోపంతో చితక బాదాడు. సూరమ్మ పరుగెత్తుకురాకపోయి వుంటే బాలయ్య దెబ్బలకు లారెల్ ఏమయ్యేవాడో.

"సూరమ్మా! బెండ కాయలు కిలో ఎంత?" అని గిరాకీ రావడంతో "పోరా లారూ! పో. వెళ్ళి పని చేసుకో" అని చెప్పి వాడిని పంపించింది.

కానీ బాలయ్య వాడినంత తేలికగా పనిలోకి రానియ్యలేదు.

"దొరా! పొరపాటై పోయింది. క్షమించండి. ఇంకెప్పుడూ ఇట్లా దిక్కులు చూసుకుంటూ నడిచి కప్పులు పగలగొట్టను" అని వేడుకుంటున్నాడు.

"ఒరేయ్! లోపలికొచ్చావంటే ఒళ్ళు చీరేస్తాను. రోడ్డు మీదనే నిల్చుని వంద గుంజీళ్ళు తియ్యరా! అదే నువ్వు చేసిన తప్పుకి శిక్ష" అన్నాడు క్రూరంగా బాలయ్య.

లారెల్ గుంజీళ్ళు తీయకుండా అలానే నిలబడ్డాడు.

"ఏంరా! ఇంకా అట్లాగే నిలబడ్డావేం. గుంజీళ్ళు తీశాకే నిన్ను లోపలికి రానిస్తాను" అని బాలయ్య మళ్ళీ హూంకరించేసరికి ఇక తప్పదన్నట్టుగా వాడు రెండు చేతులతో రెండు చెవులు పట్టుకుని ఒకటి.. రెండు.... మూడు.." అంటూ పది గుంజీళ్ళు తీసేసరికి నిక్కరు పగ్రువ చినిగిపోయింది.

చుట్టూతా గుమిగూడిన జనం ఫక్కున నవ్వారే గాని 'ఏమిటీ అన్యాయం?' అని ఏ ఒక్కరూ బాలయ్యని అడగలేదు. ఇది గమనిస్తున్న సూరమ్మ మళ్ళీ పరుగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమిటి బాలయ్యా!ఈ దారుణం? పసివాడని దయ కూడా లేదా నీకు?" అని లారెల్‌ని దగ్గరకు తీసుకుంది. వాడు వణికిపోతున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. వాడిని సముదాయించింది.

"మామ్మా! నేనిక్కడ ఇక పని చేయను. నన్ను మా అమ్మ వాళ్ళ దగ్గరకు తీసుకెళ్ళు" అని వాడు అడుగుతుంటే వాడిని దగ్గరకు తీసుకుంది.'అవునురా! అట్టా చేస్తేనే నువ్వు బతికిపోతావ్. లేకపోతే బాలయ్య గాడు నిన్ను చంపేసేటట్టే వున్నాడు' అని మనసులో అనుకుని వాడితో "అట్టాగేరా చిన్నా! కాసేపాగు. తట్ట సర్ది నిన్ను మీ ఇంటికి తీసుకెడతాను" అంది.

బస్సు ఘనపురం చేరింది. బస్టాండులో దిగి వాడిని తీసుకుని వాళ్ళింటికి వెళ్ళింది. అమ్మని చూడగానే వాడెళ్ళి కావలించుకుని ఏడ్చాడు. సూరమ్మ అక్కడ జరిగిందంతా చెప్పింది. లారెల్ బుగ్గలు నిమురుతోంది మేరీ. ఆమె ఏడుస్తోంది. సూరమ్మ తిరుగు ప్రయాణమవుతుండగా లారెల్ తండ్రి అలెగ్జాండర్ తూలుకుంటూ వచ్చాడు. అతడు ఏ అవతారంలో వున్నాడో ఇట్టే గ్రహించిన సూరమ్మ దూరంగా జరిగింది. కొడుకు ఎందుకొచ్చాడో భార్యని అడిగాడు. కొడుకు పని వదిలేసి వచ్చాడని మాత్రమే అర్థం చేసుకున్న అలెగ్జాండర్ వాడి వీపు మీద పిడి గుద్దులు గుద్దుతూ "కొడకా! నిన్ను పనిలో పెడితే ఎగ్గొట్టి వస్తావురా" అంటూ బాదుతున్నాడు. నెలనెలా నాలుగు వందల రూపాయిలు పోతాయని వాడి బాధ. తాగడానికి ఇక అన్ని డబ్బులెవరిస్తారు? అదీ వాడి బాధ.

"కొట్టకయ్యా! నేను మళ్ళీ పనిలోకెళతాను. కొట్టకయ్యా" అని లారెల్ తండ్రి కాళ్ళకు చుట్టుకుపోతూ ఏడుస్తున్నాడు.

సూరమ్మ మేరీ కలిసి వాడిని విడిపించారు.

"ఏమిటయ్యా! పాపిష్టి డబ్బు కోసం పసివాడిని కొడతావా. నీకసలు బుద్ధుందా! వాడు నీ కొడుకుకదా! అలా బాదుతున్నావేంటి! నీకూ, కన్న బిడ్డల్ని అమ్ముకునే వాడికీ తేడా ఏముందసలు? వాడు దొంగతనం చేయలేదు. హత్యలు చేయలేదు. వాడిని టీకొట్టోడు గొడ్డును బాదుతున్నట్టు బాదుతుంటేనే ఇక్కడకు తీసుకొచ్చా. నువ్వూ పశువులా వాడిని కొడుతున్నావు. ఇంత విషమిచ్చి చంపరాదూ ధూ! ఎందుకు నీ బతుకు!" అంటూ ఆవేశంగా అలెగ్జాండర్‌ని దులిపి పారేసింది.

"నువ్వెవరే ముసలీ! నువ్వు లే అడ్డం! పో ఇక్కణ్ణించి!" అని కసురుకున్నాడు.

"ఛీ! వాడి సంపాదనతో తాగడానికి నీకు మనసెలా ఒప్పింది? వాడిని కొట్టడానికి చేతులెలా వచ్చినయ్యి?" అని గద్దించేసరికి మారు మాట్లాడకుండా బయటికెళ్ళిపోయాడు అలెగ్జాండర్.

"మామ్మా! నేను నీదగ్గరికే వచ్చేస్తాను. అక్కడ బాలయ్య నేను తప్పు చేస్తేనే కొడతాడు. ఇక్కడ అయ్య నేనే తప్పూ చేయకుండానే కొడుతున్నాడు. అమ్మనీ, చెల్లెల్నీ కూడా అంతే కొడతాడు. ఇక్కడ నేనుండలేను. నీ దగ్గరికే వచ్చేస్తా" అంటూ మళ్ళీ సూరమ్మతో హైదరాబాద్ బయలుదేరాడు. సూరమ్మ మాత్రం వాడిని మళ్ళీ బాలయ్య దగ్గర చేర్పలేదు. టీ కప్పులు రేపిన తుపాను వాడి భవిష్యత్తుకు బాట వేసింది. ఇప్పుడు వాడు బాల కార్మికుల స్కూల్లో చదువుతూ సంపాదిస్తున్నాడు.